క్లుప్తంగా

నేడు సుజాతనగర్‌లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

పెందుర్తి: కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై ప్రజలను మోసం చేసిన తీరును ఎండగడుతూ 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని గురువారం సుజాతనగర్‌లో నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో సుజాతనగర్ ఆర్.కె.ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి జిల్లా పార్టీ పరిశీలకురాలు శోభా హైమావతి కార్యక్రమానికి హాజరవుతారన్నారు. పెందుర్తి రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని పార్టీ నేతలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



అప్పన్నకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1.5 లక్షల విరాళం



ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ప్రతినిధులకు బాండ్ అందజేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని సిరిపురానికి చెందిన ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ రూ.1.50 లక్షల విరాళం అందజేసింది. సింహగిరికి వచ్చిన క్లబ్ ప్రతినిధులు విరాళాన్ని నగదు రూపంలో పీఆర్‌వో కార్యాలయంలో అందజేశారు. వారికి దేవస్థానం తరపున ఏఈవో తిరుమలేశ్వరరావు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందించారు.

సూర్యకళకు వీడ్కోలు.. చంద్రకళకు స్వాగతం



గ్రంథాలయాధికారులు సూర్యకళ, చంద్రకళను సత్కరిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

పెందుర్తి: గాజువాక గ్రంథాలయానికి బదిలీపై వెళ్తున్న స్థానిక గ్రంథాలయాధికారి బి.సూర్యకళకు గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. గాజువాక నుంచి పెందుర్తికి బదిలీపై వచ్చిన గ్రంథాలయాధికారి బి.చంద్రకళకు ఘనంగా స్వాగతించారు. బుధవారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇరువురిని దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. స్థానికుడు దొడ్డి రామకృష్ణ తన కుమారుడు ధనుంజయ్ జ్ఞాపకార్థం గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు అందించారు. పెంటకోట శ్రీను భక్తి పుస్తకాలను వితరణ చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆదారి రామకృష్ణ, పెంటకోట గణేష్, కృష్ణప్రియ, సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, దేముడు, రచయిత నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ



సరకులు అందిస్తున్న పాస్టర్ విజయకుమార్

సబ్బవరం: గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని సుమారు 30 మంది పేదలు, దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. రావలమ్మ పాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చ్‌లో ట్రస్ట్ చైర్మన్ పాస్టర్ పువ్వల విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాన్స్ పారిష్ చర్చ్ పాస్టర్ అగస్టిన్ ముఖ్య అతిథిగా పాల్గొని సరకులు అందజేశారు. ప్రతి నెలా ట్రస్ట్ వ్యవస్థాపకుడు విజయకుమార్ ఇటువంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. నిత్యావసర సరకులతో పాటు ప్రయాణ ఖర్చుల కింద పేదలు ఒక్కొకరికీ రూ.500 చొప్పున అందజేసారు. కార్యక్రమంలో ఇస్సాకు, నాయుడు, తేజ, స్మైలీ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు' వదిలిస్తున్నారు

- విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా
- ఐదు నెలల్లో రూ.50 లక్షల జరిమానా వసూలు



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఏడాది క్రితం..

సబ్బవరం ప్రాంతంలోని దాబాలో పూటుగా మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై పినగాడి వైపు ఇద్దరు వ్యక్తులు వస్తున్నారు. ఆ మత్తులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొన్నారు. ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి ఓ కాలు కోల్పోయారు. ఇప్పుడు ఆ రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

ఆరు నెలల క్రితం..

ఇద్దరు మిత్రులు దాబాకు వెళ్లి అర్ధరాత్రి వరకు పూటుగా మద్యం సేవించారు. తిరిగి ఇంటికి వస్తుండగా చీమలాపల్లి వద్ద బైక్ అదుపుతప్పడంతో తుళ్లిపడ్డారు. ఓ యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. మరో యువకుడు కాలు కోల్పోయాడు. ఆ రెండు కుటుంబాలు ఇప్పటికీ కోలుకోలేని పరిస్థితి'

పెందుర్తి:

స్నేహితుడు పార్టీ ఇస్తున్నాడనో, కార్యాలయంలో ఒత్తిడి కారణమో, ఇంటికెళ్తే ఇతరత్రా సమస్యలు వస్తున్నాయనో మొత్తానికి దారిలో ఓ రెండు పెగ్‌లు వేద్దామని బారుకో, మద్యం దుకాణానికో వెళ్లడం మామూలైపోయింది. అలా తాగిన మైకంలో వాహనం నడుపుతున్న సమయంలో రోడ్డు ప్రమాదంతో వారి జీవితాలు తల్లకిందులవుతున్నాయి. ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మరోవైపు తాగి వాహనం నడిపితే పోలీసులు సైతం తమదైనశైలిలో దారిలోనే 'మత్తు' వదిలిస్తున్నారు. భారీ జరిమానాలతో దిమ్మ తిరిగేలా చేస్తున్నారు. మొత్తానికి 'డ్రంక్ అండ్ డ్రైవ్' ఇటు కుటుంబాలు చిన్నాభిన్నం కావడానికి .. అటు ఆదాయానికి గండి పడడానికి కారణమవుతోంది.

విస్తృతంగా ప్రచారం

మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలన్న ఆలోచనతో పోలీసులు పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, ఆటో స్టాండ్‌లు, ప్రధాన కూడళ్ల వద్ద నిత్యం అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచిస్తున్నారు. మద్యం మత్తులో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వలన కుటుంబాలకు జరిగే నష్టాలను పోస్టర్లు, ఇతరత్రా అంశాలతో కళ్లకు కట్టినట్లు చూపించి అవగాహన కల్పిస్తున్నారు.

భారీగా జరిమానాలు

పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఐదు నెలలుగా దాదాపు 500 మందిపై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానాను



రహదారిపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరసింగరాజు, విద్యార్థులు

కోర్టు విధించింది. మొత్తంగా ఈ ఐదు నెలలలో రూ.50 లక్షలకు పైగా జరిమానా రూపంలో మందుబాబుల వద్ద వసూలు చేశారు. అదేవిధంగా ఐదు నెలలుగా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై 5 వేల కేసులు నమోదు చేశారు. మైనర్ డ్రైవింగ్, రికార్డులు సరిగా లేనివి..ఇతరత్రా అంశాల్లో మరో 5 వేల మందిపై కేసులు నమోదు చేశారు.



మద్యపానం వల్ల వచ్చే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరసింగరాజు, సిబ్బంది

మద్యం మత్తు ప్రమాదాలకు కారణం



అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యంతో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురవడమో, ప్రమాదాలకు కారణం కావడమో జరుగుతోంది. క్షణాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ముఖ్యంగా మద్యం మత్తులో వాహనాలు నడిపితే కచ్చితంగా ప్రమాదాలను కోరి పిలిచినట్లే. అందుకే నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఎట్టి పరిస్థితిలోనూ నిబంధనలు మీరిన వారిని విడిచిపెట్టబోం. విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల గురించి విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నాం.

– ఎస్.నరసింగరాజు, పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



అప్పన్నపాలెంలో కార్డన్ సెర్చ్‌లో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సతీష్‌కుమార్



జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో బైక్‌లు తనిఖీ చేస్తున్న సీఐ

పెందుర్తి: నేర ప్రవృత్తి కలిగిన ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని స్థానిక సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరినీ విడిచిపెట్టబోమని హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంట సమీప అప్పన్నపాలెం, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీల్లో బుధవారం ఉదయం 5 నుంచి 7 గంటల వరకు 20 మంది బృందంతో కలిసి సీఐ కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అడుగడునా క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. పత్రాలు సక్రమంగా లేని 10 వాహనాలను సీజ్ చేశారు. కాలనీలో వీధిలైట్లు లేవని స్థానికులు చెప్పగా.. సంబంధిత అధికారులకు సమస్యను వివరించి లైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని సీఐ అన్నారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల గురించి ఆరా తీయాలని సూచించారు. అలాంటి వ్యక్తుల వాహనాలను, ఇతర సమాచారాన్ని తక్షణమే పోలీసులకు అందించాలని కోరారు. బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చోరీల నియంత్రణ, శాంతిభద్రతలు కాపాడే అంశంలో ప్రజల సహకారమే కీలకమన్నారు. రానున్న రోజుల్లో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిచింది సినిమా ప్రచారం చేయడానికా..?

- ప్రజా సమస్యల గురించి ఏనాడైనా పట్టించుకున్నారా..?
- పంచకర్ల రమేష్‌బాబు తీరుపై విరుచుపడ్డ బీఎస్పీ నేత కృష్ణ



పెందుర్తి: ప్రజల ఓట్లతో గెలిచి రాజ్యాంగ బద్ధంగా ఎమ్మెల్యేగా ఉన్న పంచకర్ల రమేష్‌బాబు రోడ్లపై ప్రజలను ఇబ్బందులు పెడుతూ ఒక కమర్షియల్ సినిమా కోసం ర్యాలీలు నిర్వహించడం అత్యంత హేయమైన చర్యని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ విమర్శించారు. పెందుర్తి నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను గాలికొదిలేసి నాలుగైదు రోజులుగా సినిమా కోసం గుళ్లగోపురాలు తిరగడం, ప్రెస్‌మీట్లు పెట్టి సినిమాను హిట్ చేయాలని కోరడం.. ర్యాలీలు నిర్వహించడం నీచమైన చర్యని మండిపడ్డారు. పెందుర్తిలో ఆయన బుధవారం మాట్లాడుతూ పంచకర్లకు తమ పార్టీ అధినేత మీద ప్రేమ ఉంటే అది వ్యక్తిగతంగా చూపించుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయ పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు పడుతున్నారని.. పరవాడ ప్రాంత వాసులు కాలుష్యంతో బాధపడుతున్నారని.. ప్రభుత్వ భూముల కబ్జాలు.. ఇతరాత్ర సమస్యలు అనేకమున్నాయన్నారు. వాటిపై పంచకర్ల ఇంత చిత్తశుద్ధిగా పనిచేశారా అని ప్రశ్నించారు. సినిమా చూడటం.. చూడకపోవడం ప్రజల అభీష్టమని.. ఒక సినిమాను తీసుకొచ్చి ప్రజలపై రుద్దాలనుకోవడం దారుణమన్నారు.

ప్రజల ఓటు ద్వారా ఎన్నికైన ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ సినిమా ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చీప్ పబ్లిసిటీకి దిగజారుతున్న ఇలాంటి ప్రజాప్రతినిధులకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఘటనలపై మేధావులు, ప్రజాస్వామ్యవాదులు స్పందిచాలని బీఎస్పీ నేత కోరారు.

డిజిటల్ నగదు లావాదేవీలపై అవగాహన ముఖ్యం



సబ్బవరం కళాశాలలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బ్యాంకు సిబ్బంది, అధ్యాపకులు

సబ్బవరం: డిజిటల్ చెల్లింపులు, నగదు రహిత లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతోపాటు ఆచరించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్బవరం బ్రాంచ్ మేనేజర్ డి.రాజేష్ సూచించారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బుధవారం సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి బ్యాంకింగ్ సేవలపై అవగాహన అవసరమన్నారు. నగదు రహిత లావాదేవీలు వినియోగించేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విధిగా బ్యాంకింగ్ పోర్టల్‌లో చేరాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని సూచించారు. బ్యాంకు ఉత్పత్తులను ఉపయోగించుకుంటూ బ్యాంకింగ్ సేవలను తెలివిగా వినియోగించుకోవాలన్నారు. డిపాజిటర్ అభద్రత తొలిగింపు, బ్యాంకు వైపు మొదటి అడుగు, డిపాజిటర్‌లకు బ్యాంకు ఖాతాలు తెరవడం, లావాదేవీలు నిర్వహించడంపై అవగాహన కల్పించారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, దేశంలో చెల్లింపులు, వయో వృద్ధులకు బ్యాంకింగ్ సౌకర్యం, రిజర్వ్ బ్యాంక్ ఇటీవల కల్పించిన సదుపాయాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్, ఎస్‌బీఐ మేనేజర్ డి.రాజశేఖర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజినేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్‌కుమార్, రిసోర్స్ పర్సన్లు ఎస్.హరి, ఎస్.బాలకృష్ణ, ట్రైనర్లు ఎన్.గణేష్, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ



చిన్నారికి స్పీచ్ థెరపీ శిక్షణ ఇస్తున్న థెరపిస్ట్ బాలేశ్వరి

సీతంపేట: కలెక్టర్, విద్యా శాఖాధికారి, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆదేశాల మేరకు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని భవిత సెంటర్‌లో బుధవారం దివ్యాంగ పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ ఇచ్చారు. నగరంలోని సీతమ్మధార, గోపాలపట్నం, మహారాణిపేట, పెందుర్తి, చినగదిలి ఐదు మండలాలకు చెందిన స్పీచ్ ప్రాబ్లం ఉన్న 70 మంది దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు. వీరికి భాష ఉచ్ఛరణలో అభివృద్ధి సాధించేందుకు స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి శిక్షణనిచ్చారు. పిల్లలకు, తల్లిదండ్రులకు స్పీచ్ థెరపీకి సంబంధించి అత్యంత ముఖ్యమైన మెళకువలను తెలియజేశారు. వారంలో రెండు రోజుల చొప్పున ప్రతి మండలానికి ఒక కేంద్రంగా స్పీచ్ థెరపీ అవసరమైన పిల్లలందరికీ జిల్లాలోని అన్ని మండలాలు కవర్ అయ్యేలా శిక్షణ ఇస్తామని బాలేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ జె.చంద్రశేఖర్, సీతమ్మధార మండల విద్యా శాఖాధికారులు రామారావు, బాలామణి, పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకటాపురం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం

- 26న రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



రాళ్లు తేలిన వాడచీపురుపల్లి-వెంకటాపురం రోడ్డు

పరవాడ: రాళ్లు తేలిన వాడచీపురుపల్లి – వెంకటాపురం రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. దీనిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. ఆ పనులకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఈ నెల 26న శంకుస్థాపన చేస్తారని పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తెలిపారు. ఈ రోడ్డు ఛిద్రం కావడంతో వెంకటాపురం, నునపర్తి, రావాడ, రేకవానిపాలెం గ్రామాల ప్రజలు చాలా ఇబ్బంది పడేవారు. దీనిపై సాక్షి దినపత్రికలో అనేక కథనాలూ ప్రచురితమయ్యాయి. తాజాగా ఈ నెల 14న 'ఈ రోడ్లు నరకానికి నకళ్లు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్థానికుల ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలకు ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. సుమారు కిలోమీటరున్నర రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయనుంది. రోడ్డు సమస్య తీరనుండటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శేషు



సబ్బవరం: రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఆరిపాకకు చెందిన రేషన్ డీలర్ కొప్పాక శేషు ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర సమాఖ్య మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. తనతోపాటు రాష్ట్ర అధ్యక్షుడిగా దివి లీలామాధవరావుతోపాటు మిగిలిన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారన్నారు. సమావేశంలో అన్ని జిల్లాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

తాటిచెట్లపాలెం: ఈ నెల 30న అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ మానవ అక్రమ రవాణాను అరికట్టండి అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం సీతమ్మధారలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ ఎస్.దివాకర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో మానవ అక్రమ రవాణా కూడా ఒకటని, దీని ద్వారా ఎంతోమంది అమాయకులు బలవుతున్నారన్నారు. వివిధ కారణాల వల్ల దేశంలోని ఆడ, మగపిల్లలు అక్రమ రవాణా చేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం ద్వారా దీనిని అరికట్టవచ్చన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ బాబ్జీ పాల్గొన్నారు.

'ఉక్కు' యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి



మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాల వల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్నారని.. ఉత్పత్తి ప్రభావం చూపుతోందని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద యాజమాన్యం వైఖరికి నిరసనగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. కార్మికులతో కనీసం చర్చించకుండా విభాగాలు మార్చడం వారి ఏకపక్ష నిర్ణయానికి నిదర్శనమన్నారు. మూడు నెలల్లో సుమారు రూ.200 కోట్లు లాభాలు వచ్చినా కార్మికులకు బకాయి జీతాలు చెల్లించకుండా మీనమీషాలు లెక్కిస్తోందన్నారు. హెచ్‌ఆర్‌ఏ చెల్లింపు, కరెంటు చార్జీల తగ్గింపు వంటి సమస్యలపై నేటికీ చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌లోని ఒక్కో విభాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.వి.కె.రాజు, తౌడన్న, కె.గంగాధర్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ సెహగల్‌కు ఘన నివాళి



కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐద్వా సభ్యులు

పరవాడ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో కెప్టెన్ లక్ష్మీ సెహగల్ 12వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక టిడ్కో కాలనీలో బుధవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా మహిళా మండల శాఖ అధ్యక్షురాలు మన్యాల బంగారమ్మ మాట్లాడుతూ చిన్నతనంలోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మద్య నిషేధం వంటి జాతీయ పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. సంఘ సేవకురాలు, రాజ్యసభ సభ్యురాలు అయిన సెహగల్ భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి మహిళగా నిలిచారని గుర్తు చేశారు. సింగపూర్‌లో భారతీయ నిరుపేదల కోసం వైద్యశాలను స్థాపించి భారతీయ నిరుపేదలు, కార్మికులకు ఉచితంగా వైద్య సేవలందించారన్నారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ ప్రసంగాలకు ప్రభావితురాలై స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరి కెప్టెన్ హోదా పొందారన్నారు. 2002లో వామపక్షాల మద్దతుతో రాష్ట్రపతి పదవికి పోటీచేశారని తెలిపారు. త్యాగం, ధైర్యం, దేశభక్తి లక్ష్మీ సెహగల్ సొంతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి తుంపాల అన్నపూర్ణ, మంగమ్మ, లక్ష్మి, సరోజిని, అరుణ, వరలక్ష్మి, అబద్ధం, గోపాలరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- డీఎస్పీ విష్ణు స్వరూప్



ప్రసంగిస్తున్న డీఎస్పీ విష్ణు స్వరూప్

పరవాడ: డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు సాలాపువానిపాలెం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇళ్లు అద్దెకు ఇచ్చే సమయంలో వారి నుంచి ఆధార్ కార్డు, గుర్తింపు కార్డులను తీసుకోవాలని సూచించారు. వారిపై ఎలాంటి అనుమానం కలిగినా, వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. దొంగతనాలు, గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్‌ను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల సమాచారాన్ని తెలియజేయడానికి 1972 నంబర్‌కు, సైబర్ నేరాలకు సంబంధించి 1930 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, పరవాడ మాజీ ఎంపీపీ మాధంశెట్టి నీలబాబు, సాలాపు మోహనరావు, పలువురు గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య విభాగం ఆకస్మిక తనిఖీ



బీడీఆర్ సెక్షన్ అధికారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం జీవీఎంసీ ప్రజారోగ్య విభాగాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. జీవీఎంసీ అన్ని విభాగాల ఉద్యోగులు నిర్ణీత సమయానికే విధుల్లో ఉండాలని ఆదేశించారు. స్టాటస్టికల్ ఆఫీసర్ పీవీడీ ప్రసాదరావు చాంబర్‌లో బర్త్ అండ్ డెత్ వివరాలు, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ పరిధిలో ఎన్ని హాస్పిటల్స్ నమోదై ఉన్నాయో ఆరా తీశారు. 238 హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ అయ్యాయని స్టాటస్టికల్ ఆఫీసర్ తెలిపారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు ప్రస్తుతం ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అర్జీల మేరకు వెంటనే జారీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీవీఎంసీలో రిజిస్ట్రేషన్ కాని బర్త్ అండ్ డెత్ నమోదులు జరిగే క్లినిక్‌లు, ఆస్పత్రులు ఏమైనా ఉంటే సీఆర్‌ఎస్ పోర్టల్ ద్వారా నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం వహించరాదని ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు.

అలరించిన కథా కచేరీ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరీలో రచయితలు సమాజంలో వివిధ రకాల సమస్యలపై రాసి చదివిన కథలు అలరించాయి. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథా రచన సమాజంలో సాంఘిక జీవనం, సమాజ రుగ్మతలు ప్రతిబింబించే విధంగా ఉండాలన్నారు. రచయిత డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ రచయితలకు కథా రచనలో మెలకువలు సూచించారు. అనంతరం జరిగిన కథా కచేరీలో పలువురు రచయితలు తమ స్వీయ రచాన కథలు చదవి వినిపించారు. రచయిత కె.వి.ఎస్.మూర్తి 'రెండో భార్య', అయ్యల సోమయాజుల ప్రసాద్ 'మృత్యుంజయుడు', దుర్గాప్రసన్న 'పెళ్లిచూపులు', ఉప్పల అప్పలరాజు 'కళ్లు', భాగవతుల సత్యనారాయణమూర్తి 'పిలవని పేరంటం, చిన సూర్యనారాయణ 'గొడుగ్గాడు', చల్లా రాంబాబు 'జైజై గణేశా' కొత్తూరు రమణ 'మూర్తి గారి అమ్మాయి' కథలు ఆలోచింపజేశాయి.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com